ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు

గురువారం 15 ఆగస్టు 2024

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



వైసీపీ పాపం.. రైతులకు శాపం..

- పింఛా ప్రాజెక్టుకు మోక్షమెప్పుడో?
- ప్రాజెక్టు తెగి మూడేళ్లు..
- పూర్తయ్యేందుకు ఇంకెన్నేళ్లో..?
- చుక్కనీళ్లు లేక

రైతుల ఇక్కట్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం పింఛా ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు జీవిత కాలం శాపంగా మారనుంది. వరదలకు పింఛా ప్రాజెక్టు కొట్టుకుపోయి ఇప్పటికి సుమారు రెండున్నర సంవత్సరాలకు పైగా అవుతోంది. అప్పట్లో అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇప్పటికీ ప్రాజెక్టు పూర్తి కాక అందులో చుక్క నీళ్లు లేక.. ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకనాడు దర్జాగా పంటలు పండించుకుని కడుపు నిండా తిన్న రైతులు ఇప్పుడు తిండి గింజలు కొనాల్సిన దుస్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వమైనా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు సకాలంలో కేటాయించి ప్రాజెక్టు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

స్వాతంత్ర్యం తర్వాత ప్రాజెక్టు నిర్మాణం

ఉమ్మడి కడప జిల్లాలో రాయచోటి నియోజకవర్గాన్ని కరువుకు చిరునామాగా చెప్పవచ్చు. దీంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే అప్పటి ఈ ప్రాంత నాయకుల ఒత్తిళ్లతో రాష్ట్ర ప్రభుత్వం పింఛా ప్రాజెక్టు నిర్మాణానికి నడుం బిగించింది. ఉమ్మడి చిత్తూరు, ఉమ్మడి కడప జిల్లాలో సరిహద్దులో పింఛా నదిపైన ఈ ప్రాజెక్టును నిర్మించారు. 1954లో ప్రాజెక్టు పనులు మొదలు పెట్టి 1960లో పూర్తి చేశారు. 1961 నుంచి పూర్తి సామర్థ్యంతో నీటిని నిలువ చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 0.327 క్యూసెక్కులు. ప్రాజెక్టుకు కుడి, ఎడమ కాలువలు రెండూ ఉన్నాయి. కుడి కాలువ కింద 17 తూములు, ఎడమ కాలువ కింద 14 తూముల ద్వారా 4,472 ఎకరాలకు సాగునీళ్లు అందుతాయి.

ఏజెన్సీ ప్రాంతాలకు వరప్రసాదిని

పింఛా ప్రాజెక్టును ఏజెన్సీ (గిరిజన) ప్రాంతాలకు వరప్రసాదినిగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్టు దిగువ భాగంలో 15 గిరిజన తాండాలు ఉన్నాయి. ఇక్కడ గిరిజనులతో పాటు నాలుగు గ్రామ పంచాయతీల రైతులకు ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందేది. ప్రాజెక్టు నిర్మాణం మొదటి నుంచి ఆయకట్టుదారులు పంటలు పండించుకుంటున్నారు. ప్రాజెక్టులో నిండా నీళ్లు ఉన్న సమయంలో మూడు కార్తెలూ పంటలు పండించుకున్నారనే చెప్పవచ్చు. తిండిగింజలకు కొరత లేకుండా.. పంటలు పండేవని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రాజెక్టులో నీళ్లు ఉండడం వల్ల భూగర్భజలాలు పెరిగి.. దిగువ ప్రాంతాల్లోని మామిడి రైతులకు కూడా ఎంతో భరోసాగా ఉండేది.

రైతుల ఆశలు ఆవిరి

కరువులో తప్ప మిగిలిన రోజుల్లో ప్రాజెక్టులో ఉన్న నీళ్లతో కొద్దో గొప్పో పంటలు పండించుకుంటున్న రైతుల ఆశలు 2021లో ఆవిరయ్యాయి. ఆ ఏడాది నవంబరు 19న అర్ధరాత్రి నివర్ తుఫాన్ కారణంగా మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసమర్థత వల్ల ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయింది. నియోజకవర్గంలోని కొందరు అప్పటి ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధుల ఇసుక అక్రమ వ్యాపార దాహం కూడా ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి ఓ కారణంగా చెప్పుకోవచ్చు. 2021లో ప్రాజెక్టు కొట్టుకుపోతే ఇప్పటి వరకు ప్రాజెక్టుకు మరమ్మతులు చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి నిదులు కేటాయించలేదు. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు భూములు బీళ్లుగా మారిపోయాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో మామిడి చెట్లు సైతం ఎండిపోయాయి.

రూ.84.33 కోట్లతో పనులు ప్రారంభం

ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండు సంవత్సరాలు దాటినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపు జరగలేదు. కేవలం సర్వేల పేరుతోనే కాలయాపన చేసింది. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ ప్రాంత రైతులు రాష్ట్రప్రభుత్వానికి వినతులు ఇవ్వడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.84.33 కోట్ల అంచనాతో 2023 మార్చిలో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికి సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పుడు నిధులు కేటాయించినా ఆ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి ఏడెనిమిది నెలలు పట్టే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అయినా నిధులు కేటాయించి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పింఛా ప్రాజెక్టు

ప్రాజెక్టు కన్నతల్లితో సమానం..



పింఛా ప్రాజెక్టు మాకు కన్న తల్లి వంటిది. ప్రాజెక్టులో నీరు ఉంటే పుష్కలంగా పంటలు పండేవి. వందలాది మంది గిరిజనులకు ప్రాజెక్టు అన్నం పెట్టింది. ప్రాజెక్టు తెగిపోవడంతో మూడు సంవత్సరాల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. వ్యవసాయాన్ని నమ్ముకుని బతికే మాకు ప్రాజెక్టు తెగిపోవడం.. గత ప్రభుత్వంలో సకాలంలో పనులు పూర్తి చేయకపోవడం శాపంగా మారింది. పంటలు పండించుకుని తినే మాకు.. కొని తినాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వంలోనైనా త్వరగా పనులు పూర్తి చేసి ప్రాజెక్టు దిగువ భాగంలో ఉండే రైతులకు సాగునీరు అందించాలి.

- పీరూనాయక్, రైతు, ఆరోగ్యపురం


మట్టికట్ట కొట్టుకుపోయిన చోట నిర్మించిన కాంక్రీట్ కట్టడం

స్వాతంత్ర్య వేడుకలకు శెట్టిగుంట వాసులు

- పీఎం ఆవాస్ యోజన కింద ఎంపిక


ఢిల్లీ ఎర్రకోట వద్ద శెట్టిగుంటకు చెందిన దంపతులు అల్లాబకాష్, ఆలియా

రైల్వేకోడూరు, ఆగస్టు 14: ఢిల్లీలోని ఎర్రకోటలో గురువారం జరగనున్న స్వాతం త్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు మండలం లోని శెట్టిగుంటకు చెందిన షేక్ అల్లాబకాష్, షేక్ ఆలియా దంపతులు ఢిల్లీకి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వారికి ఆహ్వానం రావడంతో వెళ్లారని జిల్లా ప్రణాళికా విభాగం కో-ఆర్డినేటర్ సి.చిన్న య్య, ఎంపీడీవో జాషువా, ఏవో కామేశ్వరరావు, హౌసింగ్ ఏఈ మురళీక్రిష్ణ తెలిపారు. తొలిసారిగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన పీఎం ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ పథకంలో ఇంటిని చక్కగా నిర్మించుకోగా కేంద్ర ప్రభుత్వం గతంలో పరిశీలించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకున్న అల్లాబకాష్, ఆలియా దంపతులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపిందన్నారు. జిల్లాలో రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లె, కురబలకోట మండలాలకు చెందిన ముగ్గురు దంపతులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. వీరికి ఢిల్లీలోని నీతి అయోగ్ సంస్థ అన్ని వసతులు కల్పిస్తుందని వారు తెలిపారు. ప్రస్తుతం వీరు ఢిల్లీలో ఉన్నారని, ఎర్రకోటలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారన్నారు.

సీఐ సాదిక్ అలీకి ప్రతిష్టాత్మక పోలీసు మెడల్



పీలేరు, ఆగస్టు 14: జిల్లా పోలీసు విభాగంలో ఎస్‌బీ-2లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.సాధిక్‌అలీకి ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీసు మెడల్ వరించింది. పోలీసు శాఖలో అందించిన విశిష్ట సేవలకు ప్రభుత్వం ఆయనకు మెడల్ ప్రకటించింది. విజయవాడలో గురువారం జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన ఆ మెడల్ అందుకోనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్‌ఐగా, సీఐగా సుపరిచితుడైన సాదిక్ అలీ ఎన్నో సంచలనాత్మక కేసులను పరిష్కరించారు. చిత్తూరు జిల్లా సత్యవేడు వద్ద సెల్‌ఫోన్ కంటైనర్‌ను అపహరించిన కంజర్‌భట్ దొంగల ముఠాను దేశంలోనే తొలిసారిగా అరెస్టు చేసిన ఘనత ఆయనది. అంతే కాకుండా 2014 నుంచి 2018 మధ్యకాలంలో 500 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకోవడమే కాకుండా ఎంతోమంది ఎర్రస్మగ్లర్లను కటకటాల వెనక్కు పంపారు. 2003లో పోలీసు శాఖలో ఎస్‌ఐగా ప్రవేశించిన ఆయన ఇప్పటి వరకు 150కు పైగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.


రాయచోటిలోని పోలీసు పెరేడ్ మైదానంలో ఏర్పాట్లు


రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

జెండా పండుగకు సర్వం సిద్ధం

- పెరేడ్ మైదానంలో పూర్తయిన ఏర్పాట్లు
- జెండాను ఆవిష్కరించనున్న మంత్రి

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 14: రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో గురువారం ఉదయం 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ఉత్సవాలకు పెరేడ్ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తానని తెలిపారు. కాగా బుధవారం సాయంత్రం పోలీసులు స్వాతంత్ర్య వేడుకల రిహార్సల్స్ చేశారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

- రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


కుళాయిల వద్ద డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 14: రాయచోటి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంత్రి రాయచోటి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రోడ్లు, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో రాయచోటి పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందుకు అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రాయచోటి పట్టణంలో ప్రజలు రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ఎన్నో ఇబ్బందులుపడే వారిని ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రికి ప్రజలు తమ సమస్యలను చెప్పుకున్నారు.

ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్య సమరయోధుల అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడిచి దేశాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వీరుల ప్రాణత్యాగాలతో నిర్మించబడిన మనదేశం మహోజ్వలంగా ఎదగాలని ఆకాంక్షించారు.

మోటారు సైకిళ్లను ఢీకొన్న లారీ

- ఇద్దరు మృతి
- మరో ఇరువురికి తీవ్రగాయాలు


మృతి చెందిన సిద్ధేశ్వర, వెంకటసుబ్బయ్యల ఫైల్‌ఫొటోలు

రైల్వేకోడూరు, ఆగస్టు 14: మండలంలోని అనంతరాజుపేట క్రాస్ రోడ్డులో బుధవారం లారీ రెండు మోటారు సైకిళ్లను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల మేరకు... మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో ఉన్న మంగంపేట అగ్రహారం గ్రామానికి చెందిన పుల్లగంటి వెంకటసుబ్బయ్య (45), బి.సిద్ధేశ్వర (40) ఇరువురు కలసి మోటారు సైకిల్‌లో రైల్వేకోడూరుకు వెళ్లి వస్తుండగా అనంతరాజుపేట క్రాస్ రోడ్డు వద్దకు రాగానే లారీ ఢీకొంది. దీంతో వీరిరువురు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే అదే సమయంలో రైల్వేకోడూరు నుంచి చిట్వేలి మండలంలోని బీపీ రాచపల్లెకు మోటారు సైకిల్‌లో వెళుతున్న నరసింహులు, గంగాధర్‌లను కూడా అదే లారీ ఢీకొంది. ప్రమాదంలో ఇరువురు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మోటారు సైకిళ్లు వెళుతున్న దారిలో ముందుగా ఒక లారీ వెళుతుండగా దానిని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అతి వేగంగా వచ్చిన లారీ మోటారు సైకిళ్లను ఢీకొందని స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్ పరారవుతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. మృతులు వెంకటసుబ్బయ్యకు భార్య మణెమ్మ, కుమారుడు చైతు ఉన్నారు. బి.సిద్ధేశ్వరకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు కార్తీక్, కుమార్తె స్వాతి ఉన్నారు. వెంకటసుబ్బయ్య, సిద్ధేశ్వరలు దగ్గర బంధువులు. ఇరువురి మృతితో మంగంపేట అగ్రహారం శోకసంద్రంలో మునిగిపోయింది. వెంకటసుబ్బయ్య, సిద్ధేశ్వర మంగంపేటలోని ప్రైవేటు కంపెనీల్లో ఒకరు ఆపరేటర్‌గా, డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. మృతుడు వెంకటసుబ్బయ్య దంపతులకు 20 సంవత్సరాల తర్వాత ఒక మగ బిడ్డ పుట్టాడు. వీరు ఆ మగ బిడ్డను చూసుకుంటూ మురిసిపోతూ వచ్చారు. అదే కాకుండా గత సోమవారం తిరుమలలో కుమారుడు చైతు పుట్టెంట్రుకలు తీయించుకుని మంగళవారం గ్రామానికి వచ్చారు. బుధవారం మధ్యాహ్నం మృత్యుఒడిలోకి వెళ్లిపోవడంతో ఆ కుటుంబ సభ్యులు దుఃఖసాగరం లో మునిగిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాద స్థలం వద్ద విలపిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- రెవిన్యూ,పోలీసు, ఎస్ఈబీ తనిఖీలు చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 14: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలను అరికట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ అదర్శ్ రాజేంద్రన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లను, మైనింగ్ పాయింట్లను తనిఖీ చేసేందుకు జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఎస్పీతో పాటు ఇతర అధికారులు ఉంటారని తెలిపారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్ లేదా ఆర్డీవో అధ్యక్షులుగా ఉంటారని, మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. రాజంపేట మండలం బోడిగుంటపల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో రాయచోటి ఆర్డీవో రంగస్వామి, ఎస్ఈబీ అధికారులు, మైనింగ్‌శాఖ ఏడీ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు కోర్టులో రూ.24 లక్షలకు ఐపీ దాఖలు

పీలేరు, ఆగస్టు 14: పీలేరులోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో గుర్రంకొండకు చెందిన అగరబత్తీల వ్యాపారి ఎస్.సయ్యద్‌బాషా రూ.24 లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. 15 ఏళ్లుగా గుర్రంకొండ, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె, రామాపురం ప్రాంతాల్లో అగరబత్తీల వ్యాపారం చేసేవాడినని సయ్యద్‌బాషా తెలిపారు. వ్యాపారాభివృద్ధి కోసం తాను గుర్రంకొండ, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె, మదనపల్లె, రామాపురం ప్రాంతాల్లోని 16 మంది వద్ద రూ.24.70 లక్షలు అప్పులు చేశానని తెలిపారు. స్థానికంగా ఉన్న తయారీదారులతో పాటు తమిళనాడు రాష్ట్రానికి చెందిన పలువురు హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచి అగరబత్తీలు కొనుగోలు చేసి విక్రయించే వాడినన్నారు. తన వ్యాపారాన్ని కరోనా పాక్షికంగా దెబ్బతీయగా తమిళనాడు రాష్ట్ర వ్యాపారులు తన వద్ద అడ్వాన్సులు తీసుకుని మోసం చేసి బోర్డు తిప్పేసారని సయ్యద్‌బాషా కోర్టుకు తెలిపారు. దీంతో వ్యాపారంలో కోలుకోలేని నష్టం వచ్చి తాను అప్పులు తీసుకున్న 16 మందికి తిరిగి చెల్లించలేని పరిస్థితి తలెత్తిందన్నారు. నష్టాల కారణంగా తన వద్ద కట్టుబట్టలు తప్ప వేరే స్థిర, చరాస్తులు లేకుండాపోయాయన్నారు. చేసేది లేక తాను ఐపీ దాఖలు చేస్తున్నానని తన పిటీషన్‌లో పేర్కొన్నారు. ఆయన ఐపీని కోర్టు అంగీకరించిందని (ఐపీ నెం.10/2024) సయ్యద్‌బాషా తరపు న్యాయవాది షౌకత్ అలీ తెలిపారు.

కుంట స్థలం ఆక్రమణ

- వీఆర్‌ఏ పేరుతో 2.72 ఎకరాలకు వన్‌బీ
- మరో 2.50 ఎకరాలు కబ్జాకు సిద్ధం
- గ్రామస్తులను బెదిరిస్తున్న వీఆర్‌ఏ
- పట్టించుకోని అధికారులు
- కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

వాల్మీకిపురం, ఆగస్టు 14: వైసీపీ ప్రభుత్వంలో వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకున్న అవినీతి బాగోతాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. మారుమూల గ్రామాలలో అయితే ఇక దోచుకున్నవారికి దోచుకున్నంత అన్నట్లు. వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె గ్రామ పంచాయతీలో కుంటపోరంబోకు భూములు ఆక్రమణ దుమారం రేపుతోంది. ఈ భూముల వ్యవహారం విషయమై వైసీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏదో ఒకటి చెప్పి కాలయాపన చేశారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె గ్రామంలో కుంట పోరంబోకు (ప్రభుత్వ భూములు) ఏకంగా ఓ వీఆర్‌ఏ పేరిట రికార్డులు కూడా సృష్టించుకున్నట్లు తెలిసింది. ఆ గ్రామానికి చెందిన ఆ వీఆర్‌ఏ సర్వే నెంబరు 407/3ఎలో 16 ఎకరాలు ఉండగా అందులో 2.72 ఎకరాలు భూమికి ఏకంగా రికార్డులు సృష్టించుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దాంతో పాటు మరో 2.50 ఎకరాలు కబ్జా చేసేందుకు చదును చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎకరా విలువ దాదాపు 15లక్షల రూపాయలు చేస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ప్రజలకు, పశువులకు ఎంతో ఉపయోగంగా ఉండే కుంట భూములు ఆక్రమణపై సంవత్సరాలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న వాదనతో పాటు రెవెన్యూ అధికారులకు ఆ వీఆర్‌ఏ ముడుపులు ఇచ్చి రికార్డులు తన పేరిట చేసుకున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కబ్జా చేసిన స్థలంలోకి పశువులు, మేకలు రానీయకుండా గ్రామస్తులను బెదిరిస్తు న్నట్లు చెబుతున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని, గ్రామంలో సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని రెండు రోజు ల క్రితం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం కూడా ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె కుంట పోరంబోకు భూముల విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రికార్డులు కూడా అందచేశాము. వీఆర్‌ఏ అక్రమణలకు పాల్పడటం పట్ల తప్పక పరిశీలిస్తాం. గ్రామస్తుల నుంచి కూడా ఫిర్యాదు వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు తప్పక చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవు.

- ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్, వాల్మీకిపురం

కలెక్టర్‌కు ఫిర్యాదు..

తాటిగుంటపల్లె గ్రామంలో కుంట పోరంబోకు భూములు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ ఆక్రమించుకుని కబ్జాకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులను సంప్రదిస్తే కలెక్టర్ వద్ద కేసు పెండింగ్‌లో ఉందని చెబుతున్నారని, ఎలాగైనా అధికారులు స్పందించి కుంట భూములను పరిరక్షించాలని కోరుతున్నారు. ఓ రెవెన్యూ ఉద్యోగి భూకబ్జాలకు పాల్పడుతుంటే పట్టించుకోరా అంటూ గ్రామస్తులు అధికారులను నిలదీస్తున్నారు.


తాటిగుంటపల్లెలో కుంట పోరంబోకు స్థలంలో సాగు చేసిన వరి పంట


అన్యాక్రాంతం అవుతున్న కుంట పోరంబోకు భూములు



ఎస్ఐగా వెంకటసుధాకర్‌రెడ్డి

రామాపురం, ఆగస్టు 14: రామాపురం ఎస్ఐగా వెంకటసుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన చిత్తూరు సీసీఎస్ నుంచి రామాపురంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి రాజంపేటకు బదిలీపై వెళ్లారు.

సిద్దవటం ఎస్ఐగా చిరంజీవి

సిద్దవటం, ఆగస్టు 14: సిద్దవటం పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చిరంజీవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎర్రగుంట్ల స్టేషన్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన పెద్దఓబన్న తొండూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. కాగా ఏఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 14: జిల్లాలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పకుండా ఈ- పంట నమోదు చేసుకోవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రి రాయచోటి మండలం శిబ్యాల గ్రామం అనుంపల్లెలో ఖరీఫ్-2024 ఈ- పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలు సాగు చేస్తుంటారని, అనివార్య కారణాల వల్ల పట నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి వారికి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. పంటలు సాగుచేసిన ప్రతి ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందిపుచ్చుకోవాలన్నారు.

కన్యకాపరమేశ్వరి నూతన దేవాలయం సందర్శన

రాయచోటి పట్టణం గాంధీ బజార్‌లోని అమ్మవారిశాల కన్యకాపరమేశ్వరి నూతన దేవాలయాన్ని బుధవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్ అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. గాంధీ బజార్‌లోని ప్రజల పిలుపు మేరకు ఈ ప్రాంతాన్ని సందర్శించానని, ఇక్కడ నూతనంగా నిర్మించబోయే కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని పరిశీలించి ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడున్న బంగారు షాపులు, బట్టల దుకాణాలు, కిరాణా షాపుల యజమానులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



శిబ్యాల హౌసింగ్ కాలనీలో బోరును ప్రారంభిస్తున్న మంత్రి

హౌసింగ్ కాలనీలో నీటి సమస్య పరిష్కారం

మండలంలోని శిబ్యాల గ్రామం హౌసింగ్ కాలనీకి మంత్రి గతంలో ఉన్న బోరుకు నూతన మోటారు బిగించి హౌసింగ్ కాలనీకి స్విచ్ ఆన్ చేసి నీరు వదిలారు. ఈ సందర్భంగా మంత్రి రాయచోటి పట్టణంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టానన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే దాదాపు 18 నూతన బోర్లు వేశామని, ఇప్పుడు శిబ్యాలలో మరొక నూతన బోరు వేస్తున్నట్లు తెలిపారు.

అనుచరుడిని పరామర్శించిన మంత్రి

చిన్నమండెం, ఆగస్టు 14: తిరుపతిలో అనారోగ్యంతో బాధపడుతూ గుండె ఆపరేషన్ చేయించుకున్న చిన్నమండెం మండలం, కొత్తపల్లి గ్రామం రోడ్డు మీద కురవపల్లెకు చెందిన తన అనుచరుడు రఘునాథను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రతిఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలి



త్రివర్ణ పతాకాన్ని పంపిణీ చేస్తున్న బీజేపీ, జనసేన నేతలు

రాజంపేట, ఆగస్టు 14: ప్రతిఒక్కరిలో దేశభక్తి పెంపొందించేందుకు హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ములక్కాయపల్లె గ్రామంలో ఇంటింటికి త్రివర్ణ పతాకాన్ని పంపిణీ చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడి జాతీయ భావాన్ని పెంపొందించడానికి ఆగస్టు 13-15వ తేది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ షబ్బీర్‌అహ్మద్, మాజీ సర్పంచ్ శివప్రసాద్, శ్రీనివాసరాజు, అనసూయమ్మ, సునీతవర్మ, రమణ, కృష్ణయాదవ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన విజయశేఖర్‌రెడ్డి



ఎస్పీని కలిసిన టీడీపీ నేతలు

నందలూరు, ఆగస్టు 14: రాయచోటిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేకర్‌రెడ్డి బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి రాజంపేట నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీ స్పందిస్తూ అన్ని సమస్యలపైన దర్యాప్తు చేసి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం ఎస్పీని పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, రాయవరం రఫీక్, లేబాక గ్రామ సర్పంచ్ నరసయ్య, టీడీపీ నాయకులు ధనుంజయనాయుడు, రాముయాదవ్ పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

రాజంపేటటౌన్, ఆగస్టు 14: హమాలీల సమస్యలు పరిష్కరించాలని, శ్రమకు తగిన కూలీలను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మార్కెట్‌లో నూతన హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజంపేట మండల హమాలీల అధ్యక్షుడిగా పి.రాముడు, సహ ఉపాధ్యక్షులు దేవేంద్ర, రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, సహాయ కార్యదర్శి భీమిలింగ, కోశాధికారి ఆర్.రామస్వామినాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు బస్తాకు రూ.12 వేలు ఇస్తున్నారని, వారి శ్రమకు గుర్తించి బస్తాపై రూ.పది కూలీ పెంచాలన్నారు. కార్యక్రమంలో హమాలీలు ఓ.రమేష్, బి.లక్ష్మీరంగయ్య, టి.లక్ష్మణ్, కె.రాముడు పాల్గొన్నారు.

సంబేపల్లె తహసీల్దార్‌గా వెంకటేశ్



సంబేపల్లె, ఆగస్టు 14: సంబేపల్లె తహసీల్దార్‌గా వెంకటేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లా కలెక్టరేట్ ఏసెక్షన్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా సంబేపల్లె తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై దృష్టి పెడతానన్నారు. మండలంలోని భూ సమస్యలపై అర్జీలు ఇచ్చిన తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌ను మండల టీడీపీ నాయకులు యువగళం సిద్దారెడ్డి, మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ టీడీపీ ఎనుగొండ నరసింహానాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డిలు కలసి శాలువా కప్పి సత్కరించారు. మండలంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్‌గా లక్ష్మీప్రసన్న

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 14: లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్‌గా లక్ష్మీప్రసన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాయచోటి కలెక్టర్ కార్యాలయం నుంచి లక్కిరెడ్డిపల్లెకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలు పరిష్కారిస్తామని ఆమె అన్నారు. రెవెన్యూ సిబ్బంది ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సమ్మద్‌ఖాన్, మండల సర్వేయర్ కరీముల్లా, వీఆర్వోలు, వీఎస్‌లు పాల్గొన్నారు.

అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తాం

● రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఆగస్టు 14: కేంద్ర జలశక్తి అనుమతుల మేరకు తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం వెల్లడించారు. బుధవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నందున భవిష్యత్తులో ప్రతి ఏడాది భారీ వర్షాలు కురవనున్నట్లు కేంద్ర జలవనరులశాఖ వెల్లడించిందన్నారు. ఈ మేరకు భవిష్యత్తులో భారీ వర్షాలు కురవనున్నందున దానికి తగ్గట్టు అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మించడం జరుగుతుందన్నారు. గతంలో 2.4 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టును 10 టీఎంసీల సామర్థ్యానికి జలవనరుల శాఖ నిపుణుల కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. అదే విధంగా అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు రైతులను దృష్టిలో ఉంచుకొని దిగువ, ఎగువ ప్రాంతాలకు ఎడమ, కుడి కాలువలను ఏర్పాటు చేసి పెనగలూరు, నందలూరు, పుల్లంపేట, రాజంపేట మండలాలకు చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు ఈ ప్రాజెక్టు పునర్నిర్మాణ రూపకల్పన జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తయిందని, ఇక పరిపాలనపై, అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి దృష్టి సారిస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రాజెక్టును త్వరితగతిన పునర్నిర్మించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇక తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాజంపేట కేంద్రాన్ని జిల్లా కేంద్రం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రధాని మోదీ ఆశీస్సులతో ఈ ప్రాంతాన్ని సాగునీటి, తాగునీటి పరంగా మౌలిక సదుపాయాల కల్పనలో ముందుకు తీసుకెళ్లడానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రాజంపేట టీడీపీ కార్యాలయంలో గురువారం ఉదయం భారీ ఎత్తున నిర్వహించనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, రాజంపేట మండల మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భారతీయ సంహిత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 14: భారతీయ సంహిత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 8, 9, 10 ఇంటర్మీడియట్ బాలికలకు భారతీయ సంహిత చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణ కోసం కొత్త చట్టాలు ప్రవేశపెట్టారని, బాలికలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా బాగా చదువుకొని మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలన్నారు. బేటీబచావో, బేటీపడావో, మిషన్ శక్తి కార్యక్రమాలపై అవగాన కలిగి ఉండాలన్నారు. బాలికలకు ఏవైనా ఇబ్బందులు వచ్చినప్పుడు 1098 నెంబర్‌కు ఫోన్‌చేసి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివశంకర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, దాద్‌బీ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సీపీవోపై చర్యలు తీసుకోవాలి: ప్రజాసంఘాలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 14: ఏపీఎండీసీ మంగంపేట బ్రాంచ్‌లో చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ మహిళా ఉద్యోగులను నిరంతరం సెక్షన్స్ మారుస్తూ వేధిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏపీఎండీసీ పరిపాలనా భవనంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేకర్, కులవివక్ష వ్యతిరేక పోరాటకమిటీ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య మాట్లాడారు. ఇతనిపై సాక్షాత్తు ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి విజిలెన్స్ ఎంక్వైరి కోరారని, ఇటువంటి ఆఫీసర్‌ని మంగంపేట బ్రాంచ్‌లో కొనసాగించడం దౌర్భాగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జనరల్ సెక్రటరీ సుబ్బరాయుడు, సీఐటీయూ రైల్వేకోడూరు మండల కార్యదర్శి పి.జాన్‌ప్రసాద్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల ప్రసాద్, కేవీపీఎస్ మండల నాయకులు టి.రామ్మోహన్, సీఐటీయూ నాయకులు నందకుమార్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరానికి భూమిపూజ

చిట్వేలి, ఆగస్టు 14: చిట్వేలి మండల పరిధిలోని పోల్పోపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ మందిరానికి నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి తనయుడు ముక్కా సాయివికాస్‌రెడ్డిలు పాల్గొని బుధవారం భూమిపూజ చేశారు. ముందుగా గ్రామస్థులు పాల్గొన్న నేతలకు శాలువాలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేకే చౌదరి, ఎంపీటీసీ క్రిష్ణయాదవ్, నారాయణయాదవ్, బాలు రామాంజనేయులు, కాకర్ల నాగార్జున, సత్యనారాయణ, బుజ్జియాదవ్, వేణుగోపాల్, చెంగల్‌రాయులు, రంగయ్య, బాలక్రిష్ణయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, నరసింహులు, శ్రీనివాసులు, మన్మథ, కూటమి నేతలు, మహిళా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ తప్పక పాటించాలి

పెనగలూరు, ఆగస్టు 14: ఐసీడీఎస్ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు చిన్నారులకు అందించే పౌష్టికాహారం విషయంలో మెనూ తప్పక పాటించాలని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీవో రాజేశ్వరి అన్నారు. బుధవారం సింగనమల, ఈటమాపురం, సిరివరం, కిరణంపల్లె, హరిజనవాడ, కొండూరు, కేసీ అగ్రహారం, ఎస్టీ కాలనీ అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు, కొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ విశాలాక్షి, పెనగలూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయ్‌కుమారి పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

ఒంటిమిట్ట, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ఒంటిమిట్టలో హిందూ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని రిటైర్డ్ ఎక్స్ఛేంజ్ సీఐ వెంకటసుబ్బయ్యతో కలిసి గ్రామ పెద్దలు తహసీల్దారు రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో హిందూ శ్మశానవాటిక లేక గ్రామంలోని ప్రజలు పెద్దఎత్తున ఇబ్బంది పడుతున్నారని, శ్మశానవాటికకు స్థలం కేటాయించి అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. దాదాపు 10 వేల జనాభా కలిగిన ఒంటిమిట్ట శ్మశానవాటికకు స్థలం లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు చనిపోతే ఎక్కడ ఖననం చేయాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కల్ల ఎల్లయ్య, గుర్రంకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ

పెనగలూరు, ఆగస్టు 14: భారతదేశం కోసం స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఈటమాపురం గ్రామంలో గురువారం ఆవిష్కరిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని రాచపాలెంలో సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్న రాజుల సామాజిక వర్గం ఇంతకాలానికి ఈ కార్యక్రమాన్ని నెరవేర్చుతున్నట్లు తెలిపారు.

ఎంఈవోపై సస్పెన్షన్ ఎత్తివేత

సుండుపల్లె, ఆగస్టు 14: మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న బుక్కే వెంకటేశ్‌నాయక్‌ను గత పది రోజుల క్రితం ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. అయితే ఉన్నతాధికారులు ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేసి తిరిగి మండలానికి నియమించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వెంకటేశ్‌నాయక్ తిరిగి బాధ్యతలు స్వీకరించారు.

బాలికల వసతి గృహం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ జడ్జి డాక్టర్ ప్రసన్న

చిన్నమండెం, ఆగస్టు 14: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల వసతి గృహాన్ని సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అలవర్చుకోవాలని సూచించారు. దీంతో పాటు తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆమె పరిసరాలను, వంట గదిని, టాయిలెట్స్‌ను, విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతేకాకుండా మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, అది ఒక విద్యతోనే సాధ్యమన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని విద్యను ఇష్టంతో అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయనీలు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ



లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 14: మండలంలోని అనంతపురం హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 30 మంది పేద విద్యార్థులకు ఉపాధ్యాయుడు గుంజు క్రిష్ణయ్య బుధవారం నోటు పుస్తకాలు, ప్రభుత్వం అందించిన సమదుస్తులు టైలర్ కూలీ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు క్రిష్ణయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా తనవంతు పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శోభారాణి, పాఠశాల కమిటీ ఛైర్మన్ సురేష్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రసాద్‌బాబు

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 14: రాష్ట్ర ప్రజలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు స్వాతంత్ర్య శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... బ్రిటీష్ వారి పాలన నుంచి విముక్తి పొందేందుకు నిర్వహించిన జాతీయ ఉద్యమంలో ఎందరో మహానుభావుల త్యాగాలు, పోరాటాలు చేశారన్నారు. వారి త్యాగ ఫలితమే ఈ రోజు స్వాతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తులకు నివాళులర్పిస్తూ త్రివర్ణ పతాకానికి సెల్యూట్ చేద్దామని పిలుపునిచ్చారు.

జెండా పండుగకు ముస్తాబైన పాఠశాలలు



పెనగలూరు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను జరుపుకునేందుకు మండలంలోని పాఠశాలలు ముస్తాబు అయ్యాయి. స్థానిక హెడ్మాస్టర్ల ఆధ్వర్యంలో నూతన ఎస్ఎంసీ ఛైర్మన్‌లు పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయించారు. అలాగే పలు పాఠశాలలో జాతీయ పతాకం రంగులను తీర్చిదిద్దారు.

ప్రతిఒక్కరూ దేశభక్తి అలవర్చుకోవాలి : ఎంపీడీఓ

వీరబల్లి, ఆగస్టు 14: ప్రతిఒక్కరూ దేశభక్తి అలవర్చుకోవాలని ఎంపీడీవో మల్లీశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం హైస్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా పై హైస్కూల్ నుంచి గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం స్థానిక బస్టాండులో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

పది రూపాయిల నాణేలు చెల్లుబాటు అవుతాయి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 18: రిజర్వ్ బ్యాంకు విడుదల చేసిన 14 రకాల 10 రూపాయిల నాణేలన్నీ చెల్లుబాటవుతాయని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. జిల్లాలో రూ.10 నాణేల అవగాహన కోసం డీసీసీ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు కెనరా బ్యాంకు రీజనల్ హెడ్ కె.మురళీమోహన్‌తో కలసి 7 రోడ్లకూడలిలో 16వ తేదీ పెద్దఎత్తున పది రూపాయిల నాణేలను చలామణి జరుపుతామన్నారు. రూ.10ల నాణెం చెల్లుబాటుపై గతంలో కూడా ప్రజల్లో అయోమయం నెలకొన్నపుడు... ఆర్‌బీఐ రూ.10 నాణేలన్నీ చెల్లుబాటవుతాయని అధికారికంగా ప్రకటించిందన్నారు. అన్ని జాతీయ బ్యాంకులు కూడా 10 రూపాయిల నాణేలపై ప్రజల సందేహాలను తీర్చినా... రూ.10నాణెం చెల్లదనే అపోహలు సామాన్యులు, వ్యాపారులు, దుకాణదారుల్లో ఉన్నాయన్నారు. ఈఅయోమయానికి తెరదించుతూ రూ.10 నాణెం చెల్లు బాటవుతుందన్నారు. ఎటువంటి సంకోచం లేకుండా అన్ని లావాదేవీల్లో రూ.10ల నాణేలను వినియోగించవచ్చని తెలిపారు.

కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీమోహన్ మాట్లాడుతూ రూ.10ల నాణెం చెల్ల దంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. రూ.10 నాణెలను వర్తకులు తీసుకు నేందుకు అంగీకరించకపోవడం తగదన్నారు. 2009 మార్చి నుంచి 2017 జూన్ మధ్యలో ఆర్‌బీఐ ఇప్పటి వరకు 14 డిజైన్లలో రూ.10ల నాణేలను విడుదల చేసిందని, అన్ని రకాల లావాదేవీల్లో వీటిని ఉపయోగించుకోవచ్చని, ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ఇక బ్యాంకు సేవలు, పొదుపు ఖాతాలు, దేశ వ్యాప్తంగా సూక్ష్మ చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు లభించే రుణాలపై అవగాహన కల్పించారు.

ముంపు పరిహారం త్వరగా ఇప్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి

కొండాపురం, ఆగస్టు 14: గండికోట ప్రాజెక్టు కింద మొదటి విడత 14 ముంపు గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని త్వరగా ఇప్పించాలని టీడీపీ నాయ కులు, కార్యకర్తలు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డిని కోరారు. కొండాపురం టీడీపీ కార్యాలయంలో మండలంలోని కార్యకర్తలు, నాయకులతో బుధ వారం సాయంత్రం భూపేశ్ సమావేశం నిర్వ హించారు. అదేవిధంగా కొండాపురం రైల్వే స్టేషన్‌లో గతంలో మాదిరి రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. మంత్రి లోకేశ్ పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా గండికోట ముంపు వాసుల కోసం పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా పలువురు నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలను భూపేశ్ దృష్టికి తీసుకెళ్లారు.

సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమలో స్థానికులకు అన్యాయం

బద్వేలు, ఆగస్టు 14: గోపవరం మండలంలో ఏర్పాటు చేసిన సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమలో స్థానికులకు అన్యాయం జరుగుతోందని ఏఐటీయూ ఏరియా కార్యదర్శి పీవీ రమణ ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఉద్యోగాల విషయంలో స్థానికులకన్నా ఇతర రాష్ట్రాల వారికే ప్రాధాన్యమిస్తున్నారని వాపోయారు. పలువురు స్థానికులు ఈ ఫ్యాక్టరీకి తమ భూములను త్యాగం చేసినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, విజయ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ క్రిష్ణారెడ్డి, రోటరీ క్లబ్ చైర్మన్ గోపాలక్రిష్ణ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: వైవీయూలో కడప రోటరీ క్లబ్ సహకారంతో బుధవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రోటరీక్లబ్ చైర్మన్ గోపాలక్రిష్ణలు ప్రారంభించారు. ఈసందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ నాలుగు ప్రధాన విభాగాల్లో వైద్యసేవలు అందించడానికి వచ్చిన డాక్టర్లను అభినందించారు. రోటరీ క్లబ్ సేవలు భవిష్యత్తులో కూడా యూనివర్శిటీకి అందించాలన్నారు. రోటరీక్లబ్ చైర్మన్ గోపాలక్రిష్ణ రోటరీ క్లబ్ సమాజానికి అందిస్తున్న సేవలను వివరించారు.

19న ఫొటోఎగ్జిబిషన్స్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: అంతర్జాతీయ 185వ ఫోటోగ్రఫీదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19న ఫోటోల ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, ఏపీ ఫొటో స్టూడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం టూరిజం సంస్థ కార్యాలయంలో ప్రదర్శనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను వారు విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో ఫొటోల ప్రదర్శన ఉంటుందని వివరించారు. కలెక్టరు శివశంకర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 5 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



వల్లూరు ఆగస్టు 14: మండల పరిధిలోని గోటూరు నుంచి కడప వైపునకు అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు గోటూరు వద్ద మాటువేసి బియ్యం సహా ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో 29 మూటలు (1450 కేజీలు) బియ్యం వున్నట్లు వెల్లడించారు. కాగా పట్టుకున్న ఆ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తూ, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి నట్లు పోలీసులు తెలిపారు.


వెల్లాల ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



వెల్లాల సంజీవరాయస్వామి పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వరద

రాజుపాలెం, ఆగస్టు 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవ రాయ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణానికి బుధ వారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదా యశాఖ కామన్ గుడ్ ఫండ్ ఫేజ్ -1 కింద రూ.3.55 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో సంజీవరాయస్వామి ఆలయ గర్భగుడి, విమాన గోపురం, అర్ధమండపం, ముఖ మండపాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్మా ణానికి సంబంధించి డిజైన్ పరిశీలించి.. దేవదాయశాఖ ఎస్‌ఈ సతీష్, ఈఈ గంగయ్య, డీఈ శ్రీనివాసులతో మాట్లాడారు. ఆలయం నిర్మాణం పూర్తి చేయాలంటే ఎంత మేర నిధులు అవసరం అవుతాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఆలయ నిర్మాణంలో నాణ్యత లోపం లేకుండా నిర్మించాలని కాంట్రాక్టరుకు సూచించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు వరదరాజులరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వెల్లాల గురుకుల పాఠ శాల, వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఎస్‌ఈ సతీష్, ఈఈ గంగయ్య, డీఈ శ్రీనివాసులు, ఈవో నరసయ్య, తహసీల్దారు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్‌లు చంద్రశేఖరరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు మానికింది ఖాదర్‌బాషా, కొట్టాల జగన్ మోహన్‌రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

రూ.11.76 లక్షల చెక్‌ను కలెక్టర్‌కు అందజేసిన కెనరా బ్యాంకు ఆర్‌ఎం



కలెక్టర్ శివశంకర్‌కు చెక్‌ను అందజేస్తున్న కెనరా బ్యాంకు ప్రతినిధులు

కడప(కలెక్టరేట్) ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ ప్రదానోత్సవం ద్వారా 5 నుంచి 10 తరగతుల వరకు ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంది. ఇందుకు సంబంధించిన రూ.11.76 లక్షల చెక్‌ను కలెక్టర్ శివశంకర్‌కు కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు మురళీమోహన్ బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. రీజనల్ మేనేజరు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా కెనరా బ్యాంకు కడప ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని శాఖల ద్వారా 294 మంది ఎస్సీ, ఎస్టీ విద్యా ర్థినులకు రూ.11.76 లక్షలను పంపిణీ చేసిందన్నారు. కెనరా బ్యాంకు దేశ వ్యాప్తంగా ఏటా జరిపే వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కార్య క్రమంలో డివిజనల్ మేనేజరు రమేష్, ఎల్డీఎం జి.జనార్ధనం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణం వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ మురళి

పులివెందుల టౌన్, ఆగస్టు 14: మున్సిపాలిటీ పరిధిలోని కదిరి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఉదయం మద్యం దుకాణంలో పనిచేసే సెక్యూరిటీ గార్డు షట్టర్ ఓపెన్ చేయగా.. వెనుకవైపు ఉన్న షట్టర్ ఓపెన్ చేసి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అప్పటికే దుకాణంలో ఉన్న రూ.4,23,160 చోరీకి గురైందని, పది మద్యం బాటిళ్లు కూడా ఎత్తుకెళ్లారని తెలిపారు. సంఘటన స్థలానికి డీఎస్పీ మురళి నాయక్, ఎస్‌ఐ అనిల్ కుమార్‌లు చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అక్కడ పనిచేసే సిబ్బందిపై విచారించారు. అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, పులివెందులలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దొంగత నాలను అరికట్టాలని కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండుకళ్లు : ఎమ్మెల్యే



అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, ఆగస్టు 14: సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ఎగువపల్లెలో బుధ వారం అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే మళ్లీ మొదలు పెడుతున్నారన్నారు. ఐదేళ్ల కిందట పూర్తయిన అంగన్వాడీ బిల్డింగ్ కేవలం టీడీపీ ప్రభుత్వంలో కట్టారన్న ఉద్దేశంతో ప్రారంభించలేదన్నారు. భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు కూడా బిల్లు చెల్లించలేదన్నారు. అలాంటి దారుణమైన పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వంలో ఉండేవన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రజలు వైసీపీని ఓడించి టీడీపీని కోరుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే సంక్షేమం అభివృద్ధి పనులు మొదలయ్యాయన్నారు. ఉచిత బస్సు, అన్నక్యాంటీన్‌లు గురువారం నుంచి మొదలవుతాయన్నారు. అంగన్వాడీ కేంద్రం చిన్నపిల్లలకు అందుబాటులోకి వచ్చిందని పౌష్టికాహారాన్ని పిల్లలకు అందజేయాలన్నారు. గడచిన ఐదేళ్లలో సీసీరోడ్లు కాల్వలు కానీ ఎక్కడ ఏర్పాటు చేయలేదని వచ్చే వారంలో సీసీరోడ్లు కాల్వలు తాగునీటి సమస్యలాంటి పనులు మొదలవుతాయన్నారు. ఈ పంచాయతీ ప్రజలు మాపై నమ్మకంతో ఓట్లు వేశారని గతంలో కంటే ఎక్కువ ఓట్లు ఇక్కడ వచ్చాయన్నారు. మీరు మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మాటలు నిలబెట్టుకుంటామన్నారు. అనంతరం కాల్వ పనులను పరిశీలించారు. టీడీపీ యువనేత పుత్తా లక్ష్మిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చంద్ర ఓబుళ్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ విశ్వనాథ రెడ్డి, మండల టీడీపీ నేతలు విజయ్‌సారధిరెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, రాజశేఖర్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలుడు, చిన్నారెడ్డి, వెంకటసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య కీర్తనలు ఆలాపన

మదనపల్లె అర్బన్, ఆగస్టు14: మదనపల్లె పట్టణం లో నిర్వహిస్తున్న ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం టీటీడీ ఆస్థాన గాయని శోభరాజుచే అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లా డుతూ అన్నమయ్యజిల్లాలోని తన స్వంత గడ్డపై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనం దంగా ఉందన్నారు. అన్నమయ్య కీర్తనలు మదన పల్లె పరప్రజలు ఆసక్తితో, భక్తిశ్రద్ధలతో విన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తోపాటు స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప (క్రైం), ఆగస్టు 14: కడప నగరంలోని అగాడివీధికి చెందిన షేక్ కరీముల్లా(55) అనే వ్యక్తి ఈ నెల 13న మంగళవారం సాయంత్రం ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య ఖదీరున్నీసా వివరాల మేరకు.. తన భర్త ఆటో నడుపుతూ జీవించేవాడని, మద్యానికి బానిసగా మారి ఈ చర్యకు పాల్పడినట్లు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు, ఆగస్టు 14: ఎలాంటి అనుమతులు లేకుండా పాపాఘ్ని నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 6 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లీలావతి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం రాత్రి తన బృందంతో దాడులు నిర్వహించి పెద్దపుత్త, పైడికాల్వ మార్గమధ్యదాడులు చేసి 6 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



బద్వేలు, ఆగస్టు 14 కేరళ వరద బాధితులకోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరించినట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీను తెలిపారు. కేరళలోని వయనాడ్ ప్రాంతంలో వరదలు రావడంతో దాదాపు 300 మంది పైబడి చనిపోయాన్నారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించేందుకు విరాళాలు సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్ని, కొండయ్య, ఆంజనేయులు, బాలస్వామి, సుబ్బరాయుడు, మోక్షమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తిమృతి



యల్లారెడ్డి (ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, ఆగస్టు 14: పట్టణంలోని ఓ లాడ్జిలో పిల్లి యల్లారెడ్డి (36) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుని స్వగ్రామం చెన్నూరు అయినప్పటికీ కడపలో ఉన్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం బద్వేలులో పనినిమిత్తం లాడ్జి తీసుకుని అక్కడే ఉంటున్నాడు. రోజూలాగే లాడ్జికి సమయానికి వెళ్లడం, రావడం జరిగేది. బుధ వారం ఉదయం ఎంత సేపటికీ తలుపులు తీయకపోవడంతో లాడ్జిలో పనిచేసే వ్యక్తికి అనుమానం వచ్చి తలుపులు తీయడంతో యల్లారెడ్డి మంచంపై మృతి చెంది ఉన్నాడు. వెంటనే లాడ్జి సిబ్బ ంది పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ రాజగోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని లాడ్జికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి ఆధార్‌కార్డు ప్రకారం వారి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనధికార ప్లాట్లు కొని మోసపోవద్దు : కమిషనర్



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల రూరల్, ఆగస్టు 14: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఅవుట్లపై చట్టపర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో పులివెందులలో అక్రమ లేఅవుట్ల దందా అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో వార్డు, పట్టణ, ప్రణాళికా కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడైనా అనధికార లేఅవుట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్ నియమాలు ఉల్లంఘించి ఇదివరకే గుర్తించిన లేఅవుట్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అక్రమ లేఅవుట్‌లలో ప్లాట్లు కొని మోసపోవద్దని, కొత్త అనధికార లేఅవుట్లలో కొన్నప్లాట్లకు ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు చేయ మన్నా రు. కావున ప్రజలు ప్లాట్లు కొనేముందు... విధిగా విచారించుకోవా లన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, క్లర్క్ అలీం పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్లు పట్టివేత

బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బాలనరసింహులు, నరసింహులు వద్ద ఒక్కొక్కరి నుంచి 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కలికిరి, ఆగస్టు 14: పట్టణంలోని యల్లమ్మ ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఈశ్వరయ్య (21)అనే యువకుడు తీవ్ర గాయాలకు గుర య్యాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబం ధించిన వివరాలు.. సోమల నుంచి కలికిరి వస్తున్న ఆర్టీసీ బస్సు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. కలికిరి నుంచి గుట్టపాలెం పంచాయతీ సి.బరిణేపల్లెకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఈశ్వరయ్య బస్సు కింద పడిపోవడంతో ఒక కాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. వాహనం నడుపుతున్న మరో యువకుడు రాజేష్‌కు కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్యకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కలికిరి సీఐ ఆదేశాల మేరకు గాయపడ్డ రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏఎస్‌ఐ మధుసూ దనాచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య కేసు దర్యాప్తు ప్రారంభం

పెద్దమండ్యం, ఆగస్టు14: పెద్దమండ్యం మండలం పరిధి లోని అటవీ ప్రాంతంలో తంబళ్లపల్లి మండలం ఉగవ బోయపల్లికు చెందిన హరినాథ్ కూతురు శ్వేత (17) అనుమానాస్పద స్థితిలో అత్మహత్య, కేసుపై బుధవారం ములకలచెరువు సీఐ మధు, తంబళ్లపల్లి ఎస్‌ఐ, పెద్ద మండ్యం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శివకుమార్ దర్యాప్తు ప్రారం భించారు. మృతురాలు తండ్రి హరినాథ్‌ను పెద్దమం డ్యం పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలతో పోలీసులు మాట్లాడి విరాలను సేకరించారు. అనంతరం అనుమానస్పద స్థితిలో బాలిక మృతి చెందిన సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలించి దహనం లో మిగిలిన చిన్న చిన్న ఎముకల నమూనాలను సేకరించారు. తం బళ్లపల్ల మండలం ఎగువ బోయపల్లిలో స్థానికులతో అధికారులు మాట్లాడారు. గత నెల 27వ తేది తం బళ్లపల్లి పోలీసు స్టేషన్‌లో శ్వేత తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దాంతో పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని ఆమెను తహసీల్దార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 9వ తేదిన ఇంటి నుంచి వెళ్లి పోయి పెద్దమండ్యం మండలం బండ్రేవు సమీపంలో అటవీ ప్రాంతంలో శవమై తేలింది. కేసు దర్యాప్తు సాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అథ్లెటిక్ జాతీయ స్థాయి క్రీడలు ముగింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు14: వలసపల్లె పంచాయతీలోని జవ హర్ నవోదయ విద్యాలయ సమితి లో నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి అథ్లెటిక్స్ జాతీయ స్థాయి క్రీడలు బుధవారంతో ముగిశాయి. ఈ మీట్‌లో 258 పాయింట్లతో కాసరగడ్ క్లస్టర్ మొదటి స్థానంలో, 150 పాయింట్లతో బళ్ళారి క్లస్టర్ రెండో స్థానంలో 162 పాయింట్లతో చిత్తూరు క్లస్టర్ మూడవ స్థానంలో నిలిచాయి. ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మదనపల్లె సబ్‌కలెక్టర్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు ఎంపికైన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాంచిలోని ఖేల్గావ్‌లో ఈ నెల 28నుంచి 30 వరకు జరగబోవు నవోదయ నేషనల్ పోటీలలో హైదరాబాద్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్‌ప్రిన్సిపాల్ వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, కొటాయి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

మంచు ముసుగు



రామకుప్పం, ఆగస్టు 14: రామకుప్పం ప్రాంతంలో వారం రోజులుగా వాతావరణం ఆహ్లాదకరంగానూ, భిన్నంగానూ ఉంటోంది. తెల్లారుజామున పొగమంచు ఆవరిస్తోంది. పగలంతా ఎండ మండుతోంది. సాయంత్రం అయ్యేసరికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, నల్లటి మబ్బులు ఆవరించి, చల్లదనాన్ని అందిస్తోంది. అడపాదడపా రాత్రిళ్ళు చిరుజల్లులతో పాటు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షం కురుస్తోంది. రామకుప్పంతో పాటు వివిధ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 5గంటల నుంచి దట్టమైన మంచు కురిసింది. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 14: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో తంబుగానిపల్లి వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. కేజీ సత్రం పంచాయతీ సీఆర్ నగర్‌కు చెందిన చెంగల్ రాయల్ (80) రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా చిత్తూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని చెంగల్ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చెంగల్ రాయల్ మృతి చెందాడు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఆత్మహత్య

గుడిపాల, ఆగస్టు 14: మండలంలోని గురుగునత్తం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోటేశ్వరరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి మతిస్థిమితం సరిగ్గా లేదు. రెండ్రోజుల క్రితం నుంచి యాసిడ్ తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సుపై విరిగిపడి ఉన్న విద్యుత్ స్తంభం

రామచంద్రాపురం, ఆగస్టు 14: ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారి పీవీపురం వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు .. తిరుపతి ఆర్టీసీ డిపో నుంచి 35మంది ప్రయాణీకులతో తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు మంగళవారం రాత్రి 9గంటలకు బస్సు బయలుదేరింది. పీవీపురం వద్ద ఎదురుగా కట్టెల లోడ్ ట్రాక్టర్ రావడంతో బస్సు డ్రైవర్ తప్పించబోయి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి బస్సుపై పడింది. డ్రైవర్ ముందుకు వెళ్లకుండా ప్రయాణికులను కిందకు దించడంతో 35మంది సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ, విద్యుత్‌శాఖ సిబ్బంది బుధవారం అక్కడికి చేరుకుని జేసీబీతో విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.

సివిల్ రైట్స్ డే ఎందుకు నిర్వహించడంలేదు?

● రెవెన్యూ అధికారులపై ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడి ఆగ్రహం



తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆనంద్ ప్రకాష్

తిరుపతి(విద్య), ఆగస్టు 14: ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశానికి రెవెన్యూ అధికారులందరూ హాజరు కాకపోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుపతి డివిజన్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్ ప్రకాష్ బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్లోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.తిమ్మిది మండలాల తహసీల్దార్లకు ముగ్గురు మాత్రమే హాజరవడంపై కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా నిర్వహించాల్సిన సివిల్ రైట్స్ డేని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి సమాధానం చెప్పలేక ఉదాసీనంగా ఉండిపోవడంతో ఇకపై క్రమం తప్పకుండా పాటించాలని ఆనంద్ ప్రకాష్ హితవు చెప్పారు. ప్రతి నెలా చివరి రోజున మండలస్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని రెవెన్యూ పోలీసు అధికారులు తప్పక పాల్గొని బడుగు, బలహీనుల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, అర్బన్ ఏఎస్పీ డీఎస్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం వరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.35 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 73,246 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 28,133 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ఐదేళ్ల తర్వాత స్వేచ్ఛా వాయువులు!



● వైసీపీ పాలనలో ఆంక్షలు, అణచివేతలతో అన్ని వర్గాల ప్రజలూ సతమతం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నేటి స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జిల్లా ప్రజలకు మాత్రం ప్రత్యేకమైనవనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళ పాటు అడుగడుగునా ఆంక్షలు, అణచివేతతో జిల్లా ప్రజలు విసిగిపోయారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల శ్రేణులకు గడచిన ఐదేళ్ళ కాలం పీడకలగా పరిణమించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరెత్తనివ్వలేదు. కనీసం తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు గట్టిగా డిమాండ్ చేసిన పరిస్థితి లేదు. దుస్థితి నెలకొంది.ఛలో విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీ వర్కర్లను మార్గమధ్యంలో అర్ధరాత్రి నిర్జన ప్రాంతాల్లో బస్సుల్లోంచి దింపేసిన అమానవీయ ఘటనలు జరిగాయి. విపక్ష శ్రేణులు మొదలుకుని వామపక్షాల వరకూ అందరి గొంతులూ మూగబోయాయి. స్థానిక ఎన్నికల్లో విపక్ష అభ్యర్థులు నామినేషన్లు కూడా దాఖలు చేయలేని దుర్భర పరిస్థితి ఆలుముకుంది. వైసీపీ నేతలు, కార్యకర్తలు వారి నుంచి నామినేషన్ పత్రాలు గుంజుకుని చింపేసిన సందర్భాలు, దాడులు జరిపి తరిమివేసిన ఘటనలూ అనేకం. చివరికి అధికార పార్టీకి చెందిన రెబెల్ అభ్యర్థులను సైతం ఇదే చేదు అనుభవం ఎదురైంది.చివరికి జిల్లాకు చెందిన ఆనాటి ప్రతిపక్షనేత చంద్రబాబు విమానంలో ఆనాడు వచ్చినా మరో విమానంలో హైదరాబాదు వెనుదిరగాల్సి వచ్చింది. బలమైన రాజకీయ పక్షమైన టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం వినిపించేందుకు రోడ్లెక్కడానికి సైతం ఆంక్షలు ఎదురయ్యాయి. కార్యకర్తలు మొదలు జిల్లా నేతలు సైతం హౌస్ అరెస్టుల పేరిట నిర్బంధాలు ఎదుర్కొన్నారు.నారా లోకేశ్‌పై సైతం పలు కేసులు పెట్టారు. ఆయన కనీసం స్టూలుపై కూడా నిల్చోకుండా ఆంక్షలు విధించారు.రాష్ట్రానికి 14 ఏళ్ళ పాటు సీఎంగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు 2021 మార్చి 1న తిరుపతి విమానాశ్రయం దాటి వెలుపలికి రాకుండా ఒక రోజంతా పోలీసు ఆంక్షలకు గురయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ దాడులు దౌర్జన్యాలపై చిత్తూరు కలెక్టర్, ఎస్పీలను కలిసేందుకు విమానంలో తిరుపతి వచ్చిన ఆయనను పోలీసులు వెలుపలికి రానివ్వలేదు.అదికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతల దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలతో చెలరేగిన వైనం సామాన్య జనానికి నిదుర లేని రాత్రుల్ని మిగిల్చింది. తిరుపతి నగరంలో ఇంటి స్థలాలను, భూములను కాపాడుకోవడం యజమానులకు అలవికాని పనిగా మారింది. ఏ రాత్రి ఎవరొచ్చి స్థలాలు ఆక్రమించి కంచె వేస్తారో, రూములు కట్టేస్తారోనని నిద్ర లేని రాత్రులు గడపాల్సి వచ్చింది. ఎంతో మంది రూ. కోట్లు విలువైన స్థలాలు కోల్పోయారు కూడా. రెవెన్యూ, పోలీసు విభాగాల్లో ఎవరిని ఆశ్రయించినా న్యాయం జరిగిన దాఖలాల్లేవు. చివరికి విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునే ప్రవాసులు సైతం అక్కడి నుంచే వీడియోల ద్వారా తమ ఆవేదన వెళ్లగక్కిన ఉదంతాలూ అనేకం ఉన్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటన తర్వాత తమ భూముల కబ్జా అయ్యాయని, బలవంతంగా గుంజుకున్నారని ఆరోపిస్తూ బాధితులు వేల సంఖ్యలో క్యూ కడుతుండటమే దీనికి నిదర్శనం.ఈ నేపధ్యంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో ప్రభుత్వం మారడంతో అన్ని వర్గాల ప్రజానీకం ఊపిరి పీల్చుకున్నారు.గత ఐదేళ్లుగా దూరమైన స్వేచ్ఛను తిరిగి పొందుతున్నట్టు ప్రజలు భావిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.అందుకే నేటి స్వాతంత్ర దినోత్సవం జిల్లా ప్రజల పాలిట నిజంగా సంబరం.

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని తడ మండలంలోని ఇరకందీవి విద్యార్థులు పులికాట్ సరస్సులో పడవపై పాఠశాలలకు వెళ్లి జాతీయ జెండాలను చేతబూని సందడి చేశారు. భారతమాతాకు జై అంటూ నినాదాలు చేశారు.

రాయలచెరువు వంక కబ్జా

పుంగనూరులో వైసీపీ నేత నిర్వాకం ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వంక స్థలంలో అక్రమ నిర్మాణం

పుంగనూరు, ఆగస్టు 14: పుంగనూరులో విలువైన స్థలాలు, వంకలు, కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో అధికారం ఉందని ధైర్యంతో వైసీపీనేతలు రూ.కోట్ల విలువ చేసే స్థలాలు ఆక్రమించారు.

పుంగనూరు రాయలచెరువు వర్షాలకు నిండితే వరద నీరు వోబికాలని, కొత్తఇండ్లు, శ్రీచైతన్య పాఠశాల, చౌడేపల్లె రోడ్డు మీదుగా ఉన్న వంక గుండా వెళతాయి. కొంతకాలంగా రాయలచెరువు వంకను పట్టణానికి చెందిన ప్రముఖ వైసీపీ నాయకుడు ఆక్రమించారు. వైసీపీ నేతకు ఉన్న స్థలానికి పక్కనే ఉన్న వంక స్థలాన్ని ఆక్రమించి కల్యాణ మండపానికి ప్రహరీ నిర్మించుకున్నారు. అలాగే కొంత ఆక్రమణ స్థలంలో పాఠశాల భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చి వంకను కలిపేశారు. పుంగనూరు నగరపంచాయతీకి ఉన్న సమయంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆక్రమణ స్థలం కొండిన్నరది, కాటమరాజుల గుడి పేరుపై ఉంది. ఆ భూమి విలువ ప్రస్తుతం కోట్ల రూపాయలుంది. కల్యాణ మండపానికి వెళ్లడానికి వంకపై నిర్మించిన వంతెన చిన్నదిగా ఉండటం, అక్కడే మలుపు ఉండటంతో పెద్దవర్షాలు వస్తే నీరు రోడ్డుపైకి వస్తున్నాయి. వంక ఆక్రమణలతో రోజురోజుకు కుంచించుకు పోతోంది. గతంలో పలువురు వంక ఆక్రమణలు, ఆలయ భూముల ఆక్రమణలపై కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా కనీసం విచారణ కూడా చేయలేదు. రాయల చెరువు కాలువను వైసీపీ నాయకులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోలేదు. ఎందుకంటే.. పుంగనూరులో ఏకాధ్రక్రమం జరిగినా నాటి మంత్రి, ఎంపీ పక్కనే ఆక్రమణలకు పాల్పడిన వైసీపీ నేతలు అత్యంత సన్నిహితంగా ఉండటమే కారణం. ఇప్పటికే పుంగనూరులో రెండు వర్షాలకు వరదలు వచ్చి భారీగానే నష్టాలు జరిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సర్వే నిర్వహించి వంక, దేవాలయ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

డీలర్ల వ్యవస్థ బలోపేతానికి కృషి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు



తిరుపతిరూరల్, ఆగస్టు14: కూటమి ప్రభుత్వ సహకారంతో డీలర్ల వ్యవస్థ బలోపేతానికి మరింత కృషి చేస్తామని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివిలీల మాధవరావు తెలిపారు. తిరుపతిలోని డీఆర్‌డీపీ హాల్‌లో బుధవారం జిల్లా రేషన్‌డీలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ..గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో డీలర్ల వ్యవస్థని నిర్వీర్యం చేసి దానికి సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చారని విమర్శించారు. 2014-19లో సీఎంగా పనిచేసిన చంద్రబాబు రూ.20 కమీషన్‌ని రూ.70, రూ.70 కమీషన్‌ని రూ.100కి పెంచడంతోపాటు సంక్రాంతి, రంజాన్ పర్వదినాలకు తోఫా ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని డీలర్లకు ఏడాదికి రూ.18కోట్లు దొర్సుబాటయ్యాయని తెలిపారు. రూ.90కోట్లు ఆదనపు ఆదాయాన్ని అందించారన్నారు. కానీ తిరిగి చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేసి.. ఎండీయూ వ్యవస్థను రద్దుచేయాలని డీలర్లు కోరుతున్నారని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు డీలర్ల ద్వారా అమలు పరచి కార్యకేతన చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.18,500, పట్టణప్రాంతాల్లో రూ.24వేల వేతనాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈపాస్ కాటాలు వినియోగంలోకి తెచ్చి డీలర్ల వేలిముద్రలతో పండాశాల తూకంతో సరుకులు అందజేసేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. గుంటూరుజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధానకార్యదర్శులు తుమ్మలగారి, పీటీవీఎల్ వరప్రసాద్, నెల్లూరుకు చెందిన కుమారస్వామి, డీలర్లు పాల్గొన్నారు.

పాకాలలో కోర్టు భవనాలకు ప్రారంభోత్సవం



కోర్టు భవనాలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

పాకాల, ఆగస్టు 14: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్,హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావ్ రఘునందన్ రావు డిజిటల్ విధానంలో పాకాలలో నిర్మించిన కోర్టు భవనాలను బుధవారం ప్రారంభించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఐ.భీమారావు సర్వమత ప్రార్థనలు, పూజలు చేసి న్యాయ భవనాలు ప్రారంభించారు. మూడు కోట్ల రూపాయల వ్యయంతో 2.45 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోర్టు భవనాల ప్రారంభోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు,ఏఎస్పీ వెంకట్రావు, ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాసులు, పాకాల జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, కోర్టు సూపరింటెండెంట్ రాజేష్, పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డెప్పనాయుడు, కార్యదర్శి గోరీశంకర్ రాజు, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఎస్ఎం నలీం, ప్రవీణ్ ప్రకాష్, జి.చంద్రమోహన్, రవి, రామనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జిల్లా కోర్టు మేనేజర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఐసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టిన ఐసెట్‌లో ర్యాంకులు పొందిన వారికి ఈ నెల 16 నుంచి 21వ తేదీ దాకా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు వెల్లడించారు. ఎస్వీయూ అడ్మిషన్ల విభాగంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

తిరుపతి కలెక్టరేట్‌లో అర్ధరాత్రి మాక్ ఆపరేషన్



కలెక్టరేట్‌లో మాక్ ఆపరేషన్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ దళాలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి 9.30గంటలకు ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. బిలబిలమంటూ వాహనాలు దిగి తుపాకులు చేతపట్టుకుని ఉగ్రమూకల కోసం వెదుకుట్టాయి. ముసుగులు ఉన్నవారికి ఇక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కలెక్టరేట్‌లో ఉన్న వారు కూడా ఏం జరిగిందో అని ఆందోళన పడ్డారు. తీరా చూస్తే ఆక్టోపస్ దళాల మాక్ డ్రిల్ అని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఉగ్రమూకలు ఒకవేళ దాడికి పాల్పడితే సిబ్బంది ఎలా అప్రమత్తంగా ఉండాలో కళ్లకు కట్టినట్లు పోలీసు, రెవెన్యూ, ఫైర్, మెడికల్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ఆక్టోపస్ బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, రవిబాబు, రామచంద్రనాయక్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి మాజీ కమిషనర్ హరితపై వేటు



● టీడీఆర్ ఎఫెక్ట్

● అనంతపురం జేసీ నియామకం రద్దు

● జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుపతి కార్పొరేషన్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో బాధ్యులపై చర్యలు మొదలయ్యాయా? తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి డి. హరితను అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇచ్చిన నియామకాన్ని రద్దు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న బాలసుబ్రమణ్యాన్ని మంగళవారం బదిలీ చేయడం ఆ క్రమంలో భాగమేనంటున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా హరిత ఐటీడీఏ(శ్రీశైలం)ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే ఆమె బాధ్యతలు తీసుకోకుండా సెలవులో ఉన్నారు. ఈక్రమంలో గతవారం జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో అనంతపురం జేసీగా నియమించడంతో బాధ్యతలు తీసుకునేందుకు సన్నద్ధం అవుతుండగా టీడీఆర్ బాండ్లపై విచారణ అంశం తెరపైకి వచ్చినట్టు తెలిసింది. దీంతో ఆమె నియామకాన్ని రద్దు చేస్తూ, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో తిరుపతి కమిషనర్‌గా ఉన్న సమయంలో టీడీఆర్ బాండ్ల జారీలో ఆమె పాత్రపై కూడా ఆరోపణలు వచ్చాయి.వ్యవసాయ భూమిని, రెసిడెన్షియల్ ప్లాట్లను కమర్షియల్ స్థలాలుగా చూపి మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం సేకరించారని విమర్శలున్నాయి. ఈ క్రమంలో కోట్లాది రూపాయల టీడీఆర్ బాండ్ల రూపంలో కొల్లగొట్టినట్లు వచ్చింది. ఆదేవిధంగా స్థల యజమానికి కాకుండా వేరే వ్యక్తుల పేరిట బాండ్లను జారీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. స్థల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేయడం, కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా దూకుడుగా వ్యవహరించారని చెబుతారు. ఈ నేపధ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి కూడా తన గ్రూప్ థియేటర్స్ గోడను కూల్చడంపై కూడా హైకోర్టు ఆదేశాలను లెక్కచేయలేదంటూ ఆమె కోర్టు ధిక్కరణ నోటీసులు అందుకోవాల్సి వచ్చింది. అదేవిధంగా ఆమె కుటుంబ సభ్యుల ఇళ్ళు, ఆస్తుల కోసమే నగరంలో పలు రోడ్ల వెడల్పు చేశారన్న విమర్శలు కూడా ఎదురయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌లతో అంటకాగారన్న విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిందల్లా చేయడం వల్లనే ఆమెకు ఇప్పుడు విచారణను ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందన్న చర్చ జరుగుతోంది. ఇది లావుంటే తాజాగా 'అమె టీడీఆర్ బాండ్ల రూపకర్త. నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన పుడు నేను చూసిన ఐఏఎస్ అధికారుల్లో హరిత అత్యంత అవినీతిపరురాలు' అని తన 'ఎక్స్'లో టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి బుధవారం పోస్టు చేయడం విశేషం.

వ్యవసాయంలో డ్రోన్ వినియోగం ఉండాలి

కలికిరి, ఆగస్టు 14: ఆధునిక వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం తప్పక ఉండాలని వ్యవసాయ వర్సిటీ సీనియర్ శాస్త్రవేత్త, డ్రోన్ నిపుణుడు డాక్టర్ మహేశ్వరి రెడ్డి పేర్కొన్నారు. డ్రోన్‌ను ప్రదర్శించి అది పనిచేసే విధానం, వ్యవసాయంలో దాని పాత్ర గురించి రైతులకు విశదీకరించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన కేవీకేల స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా రైతులతో నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన డ్రోన్ పని తీరుతెన్నులను వివరించారు. జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాల ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. తృణ ధాన్యాల ప్రాధాన్యత గురించి ఏవో మమతా రెడ్డి వివరించారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా రిసోర్స్ పర్సన్ మారుతి మహేష్ మాట్లాడుతూ టమోట పంటకు, పాడి పరిశ్రమకు అన్నమయ్య జిల్లా ప్రాముఖ్యతలో ఉందన్నారు. కేవీకే కోఆర్డినేటర్ మంజుల, శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, సోమశేఖర్ బాబు, పీరూ సాహెబ్, మాధురి పలు సూచనలు చేశారు. హాజరైన రైతులకు వ్యవసాయ పంచాంగము, ట్రైకో డెర్మా, సూడోమోనాస్‌లను పంపిణీ చేశారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయండి

తంబళ్లపల్లె, ఆగస్టు 14: సర్పంచులు, కార్యదర్శులు పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ పేర్కొన్నారు. సర్పంచులు, కార్యదర్శులకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. శిక్షణలో బాగంగా రిసోర్స్‌పర్సన్ రాజశేఖర్ నాయక్ గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, హక్కులు, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, పంచాయతీ అభివృద్ధికి తగిన ప్రణాళికలు, ఆర్థిక వనరుల సమీకరణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దిలీప్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌కు మూడు నామినేషన్లు తప్పనిసరి : సబ్ కలెక్టర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 14: మదనపల్లె డివిజన్‌లోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ప్రాథమిక పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా పంపాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా ప్రాథమికోన్నత పాఠశాల్లో నిర్వహించిన ఇన్‌స్పైర్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పిల్లల సొంత ఆలోచనల మేరకు విన్నూతమైన ప్రయోగాలను తయారు చేసి మదనపల్లె డివిజన్‌ను జిల్లా స్థాయిలో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఔకార్యక్రమంలో డివిజనల్ రిసోర్స్ టీం సభ్యులు భాస్కరన్, పీఎల్ఎన్ శాస్త్రీ, వరప్రసాద్, డివిజన్ గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే నల్లారి

కలికిరి/కలకడ, ఆగస్టు 14: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజల వద్ద నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధితో కలిసి ఆయన ఈ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల నుంచి భారీగా ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్న పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు కలకడ మండల తెలుగుయువత అధ్యక్షుడు ఇంజేటి తారకేశ్వర్ తెలిపారు. మండలంలోని ప్రజా సమస్యలను వినతి పత్రంలో ప్రస్థావించినట్లు ఆయన పేర్కొన్నారు.

అథ్లెటిక్ జాతీయ స్థాయి క్రీడలు ముగింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు14: వలసపల్లె పంచాయతీలోని జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి అథ్లెటిక్స్ జాతీయ స్థాయి క్రీడలు బుధవారంతో ముగిశాయి. ఈ మీట్‌లో 258 పాయింట్లతో కాసరగడ్ క్లస్టర్ మొదటి స్థానంలో, 150 పాయింట్లతో బళ్ళారి క్లస్టర్ రెండోస్థానంలో 162 పాయింట్లతో చిత్తూరు క్లస్టర్ మూడవ స్థానంలో నిలిచాయి. ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లె సబ్‌కలెక్టర్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు ఎంపికైన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాంచిలోని ఖేల్గావ్‌లో ఈ నెల 28నుంచి 30 వరకు జరగబోవు నవోదయ నేషనల్ పోటీలలో హైదరాబాద్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్‌ప్రిన్సిపాల్ వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, కొటాయి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య కీర్తనలు ఆలాపన

మదనపల్లె అర్బన్, ఆగస్టు14: మదనపల్లె పట్టణంలో నిర్వహిస్తున్న ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం టీటీడీ ఆస్థాన గాయని శోభరాజుచే అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లా డుతూ అన్నమయ్యజిల్లాలోని తన స్వంత గడ్డపై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనం దంగా ఉందన్నారు. అన్నమయ్య కీర్తనలు మదన పల్లె పరప్రజలు ఆసక్తితో, భక్తిశ్రద్ధలతో విన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తోపాటు స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తిరంగా ర్యాలీ



మదనపల్లె టౌన్, ఆగస్టు 14: ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం పట్టణంలో అట్టహాసంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. మదనపల్లెలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ముం దస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా మెప్మా, వెలుగు మహిళలతో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. వివిధ వాయిద్యకారులు నిర్వహించిన ర్యాలీ పురప్రజల్లో ఉత్సాహం నింపింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆర్.గురు ప్రసాద్, కోకన్వీనర్లు ఎన్.సేతు, పి.శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, లక్ష్మీనారాయణ, ఎన్.రామ లింగారెడ్డి, ఎన్.కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, ప్రసాదరావు, కృష్ణయ్య, ఆర్యవైశ్య అధ్యక్షుడు ఓంప్రకాష్, టీడీపీ నాయ కులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: దేశ ప్రధాని నరేంద్ర పిలుపు మేరకు దేశ ప్రజల్లో సమైక్యత కోసమే హర్ ఘర్ తిరంగాను నిర్వహించాలని బీజేపీ మదనపల్లె పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

పీలేరులో: స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం పీలేరులో స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోటపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహిం చారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాక ర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, ఎన్‌సీసీ అధికారి వెంకటరమణ య్య, ఎన్ఎస్ఎస్ అధికారులు సుధాకర్‌రెడ్డి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: ప్రధానమంత్రి హర్ ఘర్ తిరంగా పిలుపు మేరకు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలో త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. వివిధ విద్యా సంస్థలతోపాటు రక్షణ సంస్థ ఉద్యోగులు, సీఆర్పీఎఫ్ (సీఐఏటీ-3)కి సంబంధించిన జవాన్లు త్రివర్ణ పతాకాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లెలో ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తంబళ్లపల్లె హైస్కూల్, గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు.

నిమ్మనపల్లిలో: ప్రధాన మంత్రి హర్ ఘర్ తిరంగా పిలుపు మేరకు ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం జూని యర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు బస్టాండు కూడలిలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ యువతదేశ భక్తి కలిగి ఉండాలన్నారు.

బాలికలు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 14: బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ సూచించారు. బుధవారం న్యాయాధికారి స్థానిక కేజీబీవీ బాలిక విద్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, భోజన వసతులు, పరిసరాలను పరిశీలించారు. విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి విద్యాసామర్థ్యాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ శ్రీమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య కేసు దర్యాప్తు ప్రారంభం

పెద్దమండ్యం, ఆగస్టు14: పెద్దమండ్యం మండలం పరిధిలోని అటవీ ప్రాంతంలో తంబళ్లపల్లి మండలం ఉగవ బోయపల్లికు చెందిన హరినాథ్ కూతురు శ్వేత (17) అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య, కేసుపై బుధవారం ములకలచెరువు సీఐ మధు, తంబళ్లపల్లి ఎస్ఐ, పెద్దమండ్యం ఇన్‌చార్జ్ ఎస్ఐ శివకుమార్ దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలు తండ్రి హరినాథ్‌ను పెద్దమండ్యం పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వీఆర్వో, వీఆర్ఏలతో పోలీసులు మాట్లాడి విరాలను సేకరించారు. అనంతరం అను మానస్పద స్థితిలో బాలిక మృతి చెందిన సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలించి దహనం లో మిగిలిన చిన్న చిన్న ఎముకల నమూనాలను సేకరించారు. తంబళపల్ల మండలం ఎగువ బోయపల్లిలో స్థానికులతో అధికారులు మాట్లాడారు. గత నెల 27వ తేది తంబళ్లపల్లి పోలీసు స్టేషన్‌లో శ్వేత తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దాంతో పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని ఆమెను తహసీల్దార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 9వ తేదిన ఇంటి నుంచి వెళ్లి పోయి పెద్దమండ్యం మండలం బండ్రేవు సమీపంలో అటవీ ప్రాంతంలో శవమై తేలింది. కేసు దర్యాప్తు సాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కలికిరి, ఆగస్టు 14: పట్టణంలోని యల్లమ్మ ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఈశ్వరయ్య (21)అనే యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు.. సోమల నుంచి కలికిరి వస్తున్న ఆర్టీసీ బస్సు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. కలికిరి నుంచి గుట్టపాలెం పంచాయతీ సి.బరిణేపల్లెకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఈశ్వరయ్య బస్సు కింద పడిపోవడంతో ఒక కాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. వాహనం నడుపుతున్న మరో యువకుడు రాజేష్‌కు కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్యకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కలికిరి సీఐ ఆదేశాల మేరకు గాయపడ్డ రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏఎస్ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలి

పీలేరు, ఆగస్టు 14: ప్రభుత్వ వైద్యులపై జరుగుతున్న దాడుల నివారణకు వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని ఐఎంఏ పీలేరు శాఖ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనను వ్యతిరేకిస్తూ బుధవారం వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకు భద్రత లేకుండాపోవడం దురదృష్టకరమన్నారు. కలకత్తా జూనియర్ వైద్యురాలి కేసులోని నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం హత్యాచార ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వైద్యురాలికి నివాళులు అర్పించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ పవన్, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 14: మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి రమేష్ నాయక్ సూచించారు. మండలానికి 50 యూనిట్లు మంజూరుయ్యాయన్నారు. పశువులకు సంబంధించిన రెండు పశువుల షెడ్ యూనిట్ విలువ 1.15 లక్షలు ఇందులో ఉపాధి ద్వారా రూ.1.03 లక్షలు, రైతు వాటా రూ. 11,500 ఉంటుందన్నారు. 4 పశువుల షెడ్ 1.85 లక్షలు కాగా ఉపాధి ద్వారా రూ 1,66,500, రైతు వాటా 18,500 ఉంటుందన్నారు. గోకులాలకు దరఖాస్తు చేసుకునే వారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఉపాధిహామీ జాబ్ కార్డు, తమ స్థలం హక్కు పత్రం, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లను మండల పశువైద్య కేంద్రాల్లో గానీ, రైతు సేవా కేంద్రాల్లో గానీ సమర్పించాలని ఆయన కోరారు.